# మాయింటి కథ

– జననీ కృష్ణ, Holmdel, N.J.

"శ్రీ వైకుంఠ విరక్తాయ స్వామి పుష్కరిణీ తటే
రమయా రమమాణాయ వేంకటేశాయ మంగళం"

క్రింద పూజగదిలోంచి సన్నగా సుప్రభాతం వినిపిస్తోంది. మెలకువవచ్చి కళ్ళు తెరిచాను బద్ధకంగా. గడియారం 6:45 చూపుతోంది. అంటే మావారు లేవడం, స్నానంచేసి పూజగదిచేరడం జరిగాయన్నమాట.

అలమేలుమంగకు మోజుతీరలేదేమోనన్న సంకోచమన్నా లేకుండా, స్వామిని 6 గంటలకే నిద్రలేపి, సాక్షాత్తూ ఆదిలక్ష్మి అధరామృతానికి అలవాటుపడిన అవతారపురుషుని చెవులుపిండి, ఆరోగ్యసూత్రాలు వల్లిస్తూ అరగ్లాసు వన్ పర్‌సెంట్ పాలు త్రాగించివుంటారు.

వారాంతరపు బడలిక. కనీసం 7:30 వరకైనా పడుకోనివ్వరు. ఇలాగ చప్పుళ్ళతో నిద్రాభంగం చేస్తుంటారు. తనకెలాగూ నిద్రపట్టదు. కోడిలాగ 5 గంటలకల్లా లేస్తారు. నేను సుఖంగా నిద్రపోతూంటే చూడలేరుకదా!

మెట్లమీద అడుగులచప్పుడు–కళ్ళుమూసుకున్నాను. "ఈరోజన్నా త్వరగా నిద్రలేవకూడదూ! ఇంటికి చుట్టాలొస్తున్నారంటే ఎలా నిద్రపడుతుంది? ఏదో సాధించేదానిలాగా అన్నింటికీ ముందంజవేసి ప్రామిస్‌లు చేస్తావు. ఆఖరిక్షణంవరకూ ఏదీ పూర్తిచేయవు. పదిమందిలో మాటపోతుందేమోనని నాభయం. వెధవనిద్ర! ఇంటికి శాపంలాగ యీ కుంభకర్ణుడు పట్టుకున్నాడు కదా!" మావారి సణుగుడు ప్రాంభమైంది.

"మహాప్రభో–ఆపండి దండకం. నిద్రలేచేవున్నాను. మీరు పూర్వజన్మలో "డ్రిల్ మాస్టారు" అయివుంటారు. ఇంతకూ సుప్రభాతం నాకా, దేముడికా? రెండురాత్రులుగా నిద్రలేదు–వళ్ళంతా పులిసిపోయింది. ఇపుడన్నా కాస్త రెస్ట్ తీసుకోకుంటే సాయంత్రానికల్లా లేవలేక పడిపోతాను."

"వెధవజవాబు చెప్పకు. మండిపోతుంది. ఆ బుద్ధి నీకు ముందేవుండాలి. నిద్రలేకుంటే పనిచేయలేని దానివి ఈ వ్యాపకాలు మానేయాలి. అర్ధరాత్రి దాటేవరకూ ఆ సినిమా ఎందుకూ చూడటం. ఈరోజు సాహిత్యగోష్ఠి ఉందని తెలుసుగా. ముందుగా నిద్రపోకూడదూ. వేకువనేలేచి పనులు చేసుకుంటే ఎంత బావుంటుంది?"

చూడబోతే అష్టోత్తర శతనామాలు కాదు–సహస్రనామాలు చదివేలా ఉన్నారు. తనమాటలు వినపడకుండాఉండాలని బాత్‌రూమ్‌కెళ్ళి తలుపు మూసుకున్నాను. అసలు మనశ్శాంతి ఉండాలంటే మనసుకు నచ్చినవి చూచి, కావలసినవి మాత్రమే వినిపించుకునేలాగా ఒక ప్రత్యేక పరిధిలో అంధత్వం, బధిరత్వం ఉండడం ముఖ్యం (సెలెక్టివ్ బ్లైండ్‌నెస్, డెఫ్‌నెస్.)

దంతప్రక్షాళనం, పాదప్రక్షాళనం పూర్తిచేసి క్రిందికివెళ్ళాను. కాఫీ గుమగుమలాడుతూ పిలుస్తోంది. ఏమాటకామాటే చెప్పుకోవాలి. మావారు కాఫీ బాగా చేస్తారు.

"ఇంతకూ ఎంతమంది వస్తున్నారో ఇప్పటికైనా తెలిసిందా! ఇంకా తేలలేదా?" మావారి ప్రశ్న–నామనసులోని మాటనే అడిగారు.

"ఇప్పటిదాకా సగంమంది వస్తున్నారు. మిగిలిన సగంమంది విషయం తేలలేదు. అదే సందిగ్ధావస్థలో ఉన్నాను."

"అవునూ అందరికీ డైరెక్షన్స్ సరిగ్గా ఇచ్చావా? డిటూర్ సంగతి గుర్తుందా–మర్చిపోయావా. లేకుంటే అందరూ ప్రసాద్ గారింటికి వెళ్తారు." మరోప్రశ్నవేశారు.

తప్పదు. బాత్‌రూమే శరణ్యం. ఈదేశంలో బాత్‌రూమ్స్ ఇంతవిశాలంగా ఎందుకు కట్టించుకుంటారో ఇపుడు తెలుస్తోంది. భద్రతాస్థావరం అన్నమాట. అభిషేకం(స్నానం) పూర్తిచేసి పునరాచమనం (సెకెండ్ కాఫీ) కోసరం క్రిందికి వచ్చాను.

కిచెన్ కౌంటర్‌మీదా, డైనింగ్ టేబిల్ మీదా ఫ్రిజ్‌లో ఉన్న కూరగాయలన్నీ పరచివున్నాయి. "ఇదేమిటి? ఇవన్నీ ఎలా బయటికొచ్చాయి?"

"అవే నడచి వస్తాయనుకున్నావా? నేనే బయటికి తీసాను. ఆ భారతి, రత్న, రంజన పాకశాస్త్రంలో బాగా ఆరితేరినవారు. వాళ్ళను నీ వంటలతో మెప్పించడం జరిగేపనికాదు. హాయిగా కేటరింగ్ ఆర్డర్ చేయమంటే వినకుండా అందరికీ వండుతానన్నావు. పాపం నీసంగతి తెలీక అందరూ ఆవురావురుమని వస్తే కడుపులో కాళ్ళు పెట్టుకుని ఇళ్ళకెడతారు. గంట తొమ్మిదవుతూంది. ఇంతవరకూ ప్రారంభించలేదు. అందరూ వచ్చేవేళకు నీ పోపులతో ఇల్లంతా నింపేస్తావు."

నాకిది అలవాటే. పాపం మావారు పిల్లల్ని, నీసస్‌ని, నెవ్యూస్‌ని ఏమీ అనలేరు. ఈకాలం పిల్లలు మాటపడరుకదా!అందుకని ప్రతి శనివారం ఇలా నన్ను......క్రమశిక్షణలో ఉంచితే ఆయనకు అదో తృప్తి. ఎంతైనా పూర్వాశ్రమంలో గురువుగారు కనుక అప్పుడప్పుడూ ఊరుకుంటాను.

"ఇంతకీ వంటయేమిటి? పెరుగుగారెలు చేస్తున్నావా?"

"మళ్ళీనా? పోయినసారేగా పెరుగుగారెలు చేసాను. ఉండలుగా చేసి వేయిస్తే కాస్త సులభంగా అవుతుందనుకుంటే మీరేగా కన్నంపెడితే తప్ప గారె అవదనీ, పెరుగులో పోపువేస్తేతప్ప ఆంధ్రారుచి రాదనీ టీకా తాత్పర్యాలు చెప్పి, తర్జని, మధ్యమం, కనిష్టం అంటూ నాచేత శాస్త్రోక్తంగా ఆగారెలన్నింటికీ కన్నాలు పెట్టించారు. ఒక్కరైనా నా జింజర్ ప్రింట్స్‌ను మెచ్చుకున్నారా! ఆంజనేయస్వామికి, కార్తికేయునికీ వడమాల వేసేందుకు వీలుగా ఉంటుందనీ ఏ ఛాందసుడో కన్నంపెట్టి ఉంటాడు. ఆ గారెలకు కన్నం పెట్టకుంటే మీరేమో నా బుర్రకే కన్నం పెట్టేంతపని చేస్తారు."

ఏదేశమేగినా, ఎంత కాలమైనా–ఆవకాయ మరువరు–చాదస్తం వదలరు. కొంచెం మెచ్చుకుంటే చేయిదాటిపోతానని భయమేమో మావారెపుడూ ఇలాగ గిల్లికజ్జాలు సృష్టిస్తూ ఉంటారు.

"పోనీ పప్పుపులుసు చేసేయి. అందరూ ఆంధ్రులే. ఇష్టపడతారు. రోజూ నీ అరవసంబారు తినీతినీ విసుగేసిపోతూంది."

"అరవసాంబారేమిటీ? పెరుమాళ్ళు అన్నా, పురుషోత్తముడన్నా భగవంతుడే అయినట్లు సాంబారు అందరికీ ఒక్కటే. సాంబార్ ఈస్ సోఫిస్టికేటెడ్. సాంబారు పొడితెలీని రాతియుగంవారు. పప్పులో పులుసువేసి ఏదో చేస్తారు. మీరేగా ఒక్క ఇడ్లీలో గ్లాసుడు సాంబారుపోసి జుర్రుకుంటూ అజంతా హోటల్ అయ్యర్ని తెగపొగుడుతూ సంబరపడిపోతారు."

"నీ మొహం నీకేంతెలుసు. మా బాలమ్మగారు పప్పుపులుసు ఎంత బాగా చేసేవారో!"

"అవునవును. మీ అమ్మమ్మగారి అక్కగారు బాలమ్మగారు ఫకీరు సాయబు పేటలో-రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో నా ఖర్మకొద్దీ ఈ పప్పుపులుసు చేశారట. అదేరుచి రావాలంటూ కాల్చుకు తింటున్నారు. ఆ మహాతల్లి రెసిపి చెప్పకుండా ఫార్వర్డింగ్ అడ్రస్సు కూడ ఇవ్వకుండా ఈలోకం వదిలిపోయింది. నేను రేపు మరోలోకంలో ఆవిడను కలుసుకుంటే తప్పక నేర్చుకుని వస్తాను. అయినా ఫకీరు సాయబు పేట ఏమిటీ పేపరు కాగితంలాగా!"

"పేపరంటే గుర్తు వచ్చింది. వాళ్ళకేదో పద్యమో, కథనో వ్రాసి వినిపిస్తానన్నావు. ముందుగానే ఆలోచించి వ్రాసివుంచితే బాగుంటుంది కదా!"

"ఆలోచన ఏముంది? మీమీదే వ్రాస్తున్నాను-ఒక చమత్కారం."

"నిజంగానే వ్రాసేవు. అందరూ మొగుడిమీద వ్రాసిందని తప్పు పట్టుకుంటారు."

"ఎందుకు తప్పుపడ్తారు? భానుమతీ రామకృష్ణ అత్తగారిమీద కథలల్లి అవార్డు తెచ్చుకున్నారు కదా! మీమీద వ్రాస్తే వాళ్ళదేం పోయింది? మీ కృష్ణలీలలు చదివి సంతోషిస్తారు." ఒ చమత్కారం విసిరాను.

"నీయిష్టం. ఏం చేసుకుంటావో" ఇంతలో నాల్గవసారి ఫోనుమ్రోగింది. ప్రొద్దున్నించీ వస్తున్నామనీ లేదా రాలేమనీ ఫోన్‌కాల్స్.

"ఇంతకీ ఈరోజు వంటకు మెన్యు కుదరలేదా? మాటలు మారుస్తున్నావు." అని పట్టువదలని విక్రమార్కునిలా శ్రీవారి ప్రశ్న.

"నాకిష్టమైన అవియల్ చేద్దామనుకుంటున్నాను." నిజం చెప్పేశాను.

"చచ్చాం! అవయవాలు కూడ ఒక వంటేనా! గుత్తివంకాయకూర చెయ్యి. కావాలంటే సాయంచేస్తాను.

"మీకో నమస్కారం. టైమ్ లేదు. ఈరోజుకిలా నన్ను వదిలేయండి." ఒ నమకం ప్రయోగించాను.

"ఆ శాస్త్రిగారి భార్యచూడు-పనసపొట్టుకూర,పోలిపూర్ణం, బూరెలు ఎంత బ్రహ్మాండంగా చేసారో-భోజనమంటే అలావుండాలి."

బాబోయ్! శృతిమీరిపోతూంది. రుద్రం చదవాల్సిందే! కానీ ఆయన తిరగబడి నామీద మంత్రపుష్పం చదివితేనో! లాభంలేదు. ఇలా చదువుకుంటూ పోతే కుప్పించి ఎగసిన కుండలంబుల కాంతితో నేనూ, మధ్యందిన మార్తాండునిలా మావారూ శస్త్రాస్త్రములు సంధించవలసి ఉంటుంది. నొప్పింపక తానొవ్వక తప్పించుకోవాలని అమ్మమ్మ చెప్పింది. ఏదోనెపంపెట్టి ఇంటినుండి పంపకుంటే నా ప్రాణాలు తినేస్తారింక. మార్జాలసంపర్కం అంటే ఇదేనేమో!

"పోస్టాఫీసు, బ్యాంకు 12 గంటలకల్లా మూసేస్తారు. మర్చిపోయారా! కార్ వాష్ కూడా చేయించాలి." గుర్తుచేసాను.

ఆయన వెళ్ళిపోయారు. ఇంక స్వేచ్ఛగా రాజ్యమేలుకోవచ్చు. ఇంతలో ఆరవసారి ఫోనుమ్రోగింది. రోజంతా ఇలా ఫోనుమీదనే ఉంటానేమో! అసలు పని జరిగేలాలేదు అపుడే 11 గంటలుదాటింది. సూక్ష్మంలో మోక్షం వెదకాల్సిందే. టెలిఫోను డెరెక్టరీ తీసాను- "హల్లో యీజ్ దిస్ అమరావతి? ఐ వాంటు ఆర్డర్ డిన్నర్ ఫర్ 30 పీపుల్ టునైట్"- హాయిగా ఊపిరి పీల్చుకున్నాను.**.**.**

(డిసెంబరునెలలో జరిగిన సాహిత్యసమూహంలో చదివిన అంశం)

## ద్వితీయ ఉత్తమ రచనల పోటీ

"ఈశ్వర" నామ సంవత్సర ఉగాది ఏప్రిల్ 8, 1997) సందర్భంగా, అమెరికాలో నివసిస్తున్న తెలుగు రచయితలను ఉత్తేజ పరిచే ఉద్దేశంతోనూ,ఔత్సాహికరచయితలను ప్రోత్సహించే అభిలాషతోనూ, ఈ ఉత్తమ రచనల పోటీలని నిర్వహిస్తున్నాం. గత ఉగాది( 1996) లో జరిపిన మొదటి పోటీ లో అనేకమంది రచయితలు పాల్గొని మా ప్రప్రథమ తెలుగు రచనల పోటీని దిగ్విజయంగా జరిపించారు. ఆ ప్రోద్బలంతో ఈ రెండవ పోటీలో నవలా రచన కూడా జోడించాం.

**ఉత్తమ కథానిక: మొదటి బహుమతి: $116 రెండవ బహుమతి: $58**

**ఉత్తమ గేయం: మొదటి బహుమతి: $116 రెండవ బహుమతి: $58**

**ఉత్తమ నవల: మొదటి బహుమతి $200**

**కథలు, గేయాలు మాకు చేరవలసిన ఆఖరి తేదీ: ఏప్రిల్ 8, 1997 (ఈశ్వర నామ సంవత్సర ఉగాది)నవలలు మాకు చేరవలసిన ఆఖరి తేదీ: జూన్ 1, 1997.**

**ముఖ్య అంశాలు:**

1. తెలుగులో కథానికలు పది పేజీలు, గేయాలు రెండు, మూడు పేజీలు. నవల రెండు వందల పేజీలు. వ్రాత పతి మించ కూడదు

2. ఉత్తర అమెరికా నివాసు లైన రచయితల అముద్రిత, స్వీయ రచనలు మాత్రమే పోటీకి అంగీకరింప బడతాయి. కలం పేరుతో వ్రాసినా, అసలు పేరు, చిరునామా, ఫోన్ నెంబరు మాకు తెలియాలి.

3. రచనలు వ్యావహారికంలో గాని, గ్రాంధికంలో గాని ఉండవచ్చును.

4. ఉత్తమ రచనల నిర్ణయం డా. పెమ్మరాజు వేణుగోపాల రావు (అట్లాంటా, జార్జియా) గారి ఆధ్వర్యంలో అజ్ఞాత న్యా య నిర్ణేతలు విడివిడి గానూ, కలిసి నిర్ణయిస్తారు.

5. బహుమతి పొందిన రచనలు, ప్రచురణార్హమైన మిగిలిన రచనలూ, పుస్తక రూపేణా ప్రచురించబడతాయి.

6. రచనలు దేశికాచారి గారి "పోతన" ఫాంట్స్ లో టైప్ సెట్ చేసి పంపించి, మాకు సహాయ పడితే చాలా కృతజ్ఞతలు.

**రచనలు పంపవలసిన చిరునామా:**

Vanguri Foundation Of America, Inc.
P.O. BOX 1948
Stafford . Tx . 77497

వివరాలకు: పి. వేణుగోపాల రావు:

ఇల్లు 404 634 4982, ఆఫీసు 404 727 4297

వంగూరి చిట్టెన్ రాజు :ఇల్లు, 281-493-9054, ఆఫీసు 281-4994444